www.maganti.org
email: contact@maganti.org

సురభి అంటే రంగస్థలంపై ఇంద్రజాలం, మహేంద్రజాలం... మన తెలుగు వారికి ప్రియమయిన నాటకాలలో కనికట్టు విద్య అతి సుళువుగా, అత్యంత నేర్పుగా, ముగ్ధమనోహరంగా, రమణీయంగా చూపగలిగిన మాంత్రికురాలు, మీ / మా / మనందరి - సురభి నాటక సంస్థ.

సురభి అన్న పేరే నాటకానికి మారుపేరుగా , పుట్టినిల్లుగా ఎదిగిన ప్రతిభాశీల. సుమారు నూట ఇరవయి సంవత్సరాలుగా మన తెలుగు వారి జీవితాలతో మమేకమై, మన జీవనసరళిలో ఒక భాగమై, తెలుగు నాటక చరిత్రలో ఒక కొత్త ఒరవడిని సృష్టించిన ధన్యజీవి.

గరళకంఠుడు విషాగ్ని విషాదాన్ని తాను మింగి ప్రపంచానికి సంతోషాన్ని, ఆనందాన్ని ఎలా పంచాడో, సురభి నాటక సంస్థ కూడా విషాదాన్ని తాను మింగి వినోదాన్ని మనకు పంచింది, పంచుతోంది.

పద్యనాటకాన్ని తన గుండెల్లో పెట్టుకుని బతికించి మన తెలుగు వారికి శతవత్సరాలుగా వినోదాన్ని పంచుతున్న, మన తెలుగు వారి సంస్కృతి పరిరక్షణకి పాటు పడుతున్న ఆ మహాసంస్థకి చేయూత ఇయ్యవలసినదిగా సవినయంగా మనవి చేస్తున్నాను.

మీరు పెద్ద పెద్ద ధన సహాయాలు ఏమీ చెయ్యనఖ్ఖరలేదు.. మీరు చెయ్యవలసిందల్లా, శలవురోజుల్లో మీ పిల్లలతో, కుటుంబంతో సినిమాలకు ఎలాగయితే వెళ్తున్నారో - అలాగే మీ ఊర్లో సురభి సంస్థ వారు నాటకాలు వేస్తున్నప్పుడు..కొంచెం తీరిక చేసుకుని అందరిని తీసుకుని వెళ్ళండి.అదే మీరుచెయ్యగలిగిన సహాయం.

మనం చూస్తున్న ఏ సినిమాలు గాని, వాటిలో ఉండే కంప్యూటర్ గ్రాఫిక్స్ గాని - వాటి మూలస్తంభాలు ఈ లాంటి నాటకకళలనుంచే ఆరంభం అయ్యాయి అని తెలుసుకున్ననాడు, మీరు మనస్ఫూర్తిగా మన సురభిని అభిమానిస్తారు, ఆదరిస్తారు.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

అదే మన వారికి, మన సురభికి, మన సంఘానికి , మన కళలకు మీరు చేయగలిగిన ఉపకారం.నాటకం చూస్తూ మీరు చేసే ఆదరణీయచప్పట్లే సురభికి, తమ జీవితం సురభికే అంకితం చేసిన కళాకారులకి జవజీవాలు.

మన కళలు మనమే మట్టుపెట్టుకున్న చందంకాకుండా మీ మీ వంతు సహాయం చెయ్యవలె అని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాను.

ఇక సురభి పుట్టుపూర్వోత్తరాలకి వస్తే **1885** లో వనార్సి గోవిందరావుగారు వ్యవస్థాపకులు గా కడప జిల్లా, లక్కిరెడ్డిపల్లి సమీపంలోని సురభి గ్రామంలో కీచక వధ నాటకంతో ఊపిరిలు ఊది, జీవిత గమ్యాన్ని ప్రారంభించి,కళాకారులు మరియు ప్రేక్షకులు అనే అంగాల సమిష్టి కృషితో ఉత్థానానికి ఎదిగిన మహా వృక్షం.

చీడలుపట్టి ఇక ఈ మహావృక్షం కూలిపోతుంది అనుకున్న సమయానికి, ఆ దేవుడే పంపించినట్టు శ్రీ కె.వి.రమణాచారిగారు, శ్రీ గరిమెళ్ళ రామమూర్తిగారు చొరవ తీసుకుని ఈ మహావృక్షాన్ని బతికించడానికి శాయశక్తులా పోరాడి తమ వంతు సహాయం చేసారు.ఇక మన వంతు సహాయం మనం చేద్దాం.

సురభి కళాకారులు ఆర్థికంగా నిరుపేదలు అవ్వొచ్చుగాక, కాని రంగస్థలం పై వారు రాజులు, మహారాజులు. వారి కడుపుకి ప్రేక్షకుల చప్పట్లే ఆహారం.రేకుల షెడ్ లొ ఒక మూల మూడంకెవేసి పడుకుని, రేపటి ప్రదర్శన రక్తి కట్టించడానికి శ్రమిస్తున్న మహాకళాకారులు. వారికి చేయూతనివ్వండి.

ఈ అఖండభూప్రపంచంలో వేరే ఏ జాతికి లేని మన ఈ ఘనమైన సంపదని మనమే కాపాడుకోలేకపోతే చరిత్ర మనల్ని క్షమించదు.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

[www.maganti.org](http://www.maganti.org)
email: [contact@maganti.org](mailto:contact@maganti.org)

మరింత విస్తృతం గా సురభి చరిత్ర , సురభికి చెందిన కళాకారులు, సురభి వారి నాటకాలు మరియు ఇతర వివరాలు సేకరించి మీ ముందు ఉంచటానికి ప్రయత్నిస్తాను. సలహాలు, సహాయ సహకారాలకు ఎల్లవేళలా ఆహ్వానం.

[www.maganti.org](http://www.maganti.org)
email: [contact@maganti.org](mailto:contact@maganti.org)



PDF created with pdfFactory trial version [www.pdffactory.com](http://www.pdffactory.com)